# జాతకాలరాయుడు



వీరసురు

“ఒరేసత్యం! ఇరవై శతాబ్దంలో పుట్టి బి. యస్. సి. చదివి ఇంకా పాతపుస్తకాల జాబితా ప్రకారం నడుచుకుంటానంటావేమిట్రా నీ ఖాదస్తం గాని. నీ బ్రహ్మచర్యం ముదురుపాకంలో పడక ముందే పెళ్ళి చేసుకోరా” అంటే వాడేమాత్రం చలించడుగదా! పైగా నీకా నమ్మకం లేకనే అఘోరిస్తున్నావు. లేకుంటే ఏ యూనివర్శిటీలోనో ప్రొఫెసర్ అయివుండేవాడివి అంటాడు. ఈ విధంగా ఒక్కసారి పైకి తీసుకొనిపోయి నోరు మూయించడం వానికి హైస్కూలు చదువుల్లోనే అలవాటయింది.

సత్యం నేను ఆరవతరగతినుండి బి. యస్. సి దాకా చదువుకున్నాం. వాడు హైస్కూల్లో చదువుకొనేటప్పుడే అణా, అర్ధణా ఇచ్చి కోయవాళ్ళచేత చేతులు చూపించుకోవటం, చిలుకచేత అదృష్టపు కార్డులు తీయించడం చేస్తుండేవాడు. ఇవన్నీ నాకు పసేమిరా గిట్టకపోయినా వాడు నా స్నేహితుడైన ఖర్మకొద్దీ చూస్తుండక తప్పేదికాదు. ఆ రోజుల్లోనే అవన్నీ అబద్ధంగా అనేవాణ్ణి. ఆ మాటన్నప్పుడు అవన్నీ నిజం అని నమ్మించేందుకు కమ్మటి కథలు చెప్పేవాడు. కథలు కమ్మగావున్నా నాకు మాత్రం ఎందుకో అవికూడా అబద్ధంగా ఉండేవి.

కాలేజిలో అడుగుపెట్టిన తర్వాత గూడా అవి మానక మంచిరోజు చూసి ఫీజు కట్టడం, పుస్తకాలు కొనడం, కాలేజికి పోవడం మొదలుపెట్టి అట్లాగే నన్ను కూడా చెయ్యమని బలవంతం పెట్టేవాడు. మునిసిపల్ లైబ్రరీకి పోయి శకున శాస్త్రాలు, పుట్టుమచ్చల శాస్త్రాలు తీసుకొని మరీ పరిశీలించి సాయంత్రం షికారు కెళ్ళినప్పుడంతా బలవంతంగా నాచేత చొక్కా విప్పించి పుట్టుమచ్చలన్నీ జాగ్రత్తగా పరిశీలించేవాడు. అస్ట్రాలజీ మాగజైన్. లైబ్రరీలో ఎవ్వడూ తాకక పోయినా వీడుపోయి పదిమార్లు తిరగేసి కంఠస్థం చేసేవాడు. మేం తీసుకున్న ఎమ్. పి. సి గ్రూపు వానికి మరీ సాయం పడిందనేవాడు. అదృష్టపు అంకెలు అవీ ఇవీ ఎన్నో నేర్చుకొని పేర్లకు అంకెలకు ముడిపెట్టి పబ్లిక్ పరీక్షల నెంబర్లు వచ్చిన తర్వాత ఫలితాలు ముందుగా నిర్ణయించేవాడు. ఎప్పుడో వచ్చే ఫలితాల సంగతి దేముడెరుగు వీని నిర్ణయం మాత్రం అప్పుడప్పుడు కొట్టించుకొనేంత ప్రమాదం తెచ్చిపెట్టేది. అప్పుడు విధిగా నేను అడ్డుపడాల్సొచ్చేది.

సత్యంగాడి బి. సి నాటి ప్రవృత్తికి, నా డైనమిక్ భావాలకూ పొత్తుకుదరకపోయినా వాడికి నాకు చెప్పలేనంత అనురాగం. ఒక కారణం వాడి తండ్రి, మా తండ్రి ఇద్దరూ బడిపంతుళ్లు కావటం. రెండవది ఎంత తిట్టినా చిరునవ్వు నవ్వే వాని మంచితనం. మూడవది మేమిద్దరం క్లాస్‌మర్కులు తెచ్చుకొనే ఇంటెలిజెంట్స్ కావటం.

మేమిద్దరం బి. యస్ సి. ఫస్టుక్లాసులో పాసయిన తర్వాత సత్యంగాడితో ఎమ్. యస్. సి. వెళ్దాం, రారా అన్నాను. వానికి ఉద్యోగం చేయాలనే తొందర యెక్కువై కొఠారీకమిషన్ స్కేల్సు వస్తాయని ఆశపడి బి ఇడి. కెళ్ళాడు. నేను మాత్రం ఎమ్.యస్.సి.కి వెళ్ళాను. వాడు బి ఇడి. పూర్తిచేసుకొని చిత్తూరు జిల్లా పరిషత్‌లో

ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆ తర్వాత వాని కోసం సంబంధం కూడా వచ్చినట్లు విన్నాను. కాని అదెందుకు కుదరలేదో తెలుసుకుందేందుకు అవకాశం దొరకలేదు.

ఎమ్. యస్. సి. పూర్తిచేసుకొని నేను చదివిన కాలేజీ లోనే లెక్చరర్‌గా చేరాను. చేరిన రెణ్ణెల్లకు సంబంధం వచ్చింది. కట్నం లేకపోయినా అమ్మాయి కూడా ఎమ్. యస్. సి. చదివిఉండటం వలన ప్రయత్నంచేసి గవర్నమెంట్ వుమెన్ కాలేజీలో లెక్చరర్‌గా చేర్పిస్తే సంసారం సుఖాల సాగరం అవుతుందని ఒప్పుకొన్నాను. మా అమ్మగారు నాకడ్డు చెప్పలేదు. పెళ్ళికి సత్యంను పిలిచాను. వాడు నా మీదున్న ఆప్యాయత కొద్దీ రెండు రోజులు ముందుగానే వచ్చాడు. ఏదో ప్రస్తావనలో నాక్కాబోయే భార్యపేరు అడుగపోతూ వెడ్డింగ్‌కార్డ్ తీసి తెలుసుకొని. "ఒరేయ్! అమ్మాయి జాతకం తెప్పించావా' అన్నాడు. 'నీవికొచ్చిన మొదటి సంబంధం ఈ జాతకాల వల్లనే కుదర్లేదేమో నని ఊహించి అడిగాను, నా ఊహ సెంట్‌పర్సెంట్ కరెక్టయింది. అప్పుడు 'ఒరేయ్! జాతకాల సంగతి ఎత్తితే తంతాను.' అన్నాను, దాంతో ఆ ప్రస్తావన కట్టిపెట్టి ఉద్యోగం సంగతి చెప్పాడు. మునిసిపల్ హైస్కూల్లో చేరితే ఇక్కడే ఉండొచ్చన్నాడు. బాగుంటుందన్నాను. ఆతర్వాత పెళ్ళయి నంతవరకుండి ఒక ఉంగరం చదివించి వెళ్ళాడు.

సత్యం తల్లి పోయాక తండ్రి సుకుమారంగా పెంచాడు వాడొక్కడే అయినందు వలన. ఆయన కూడా వృద్ధుడై పోయాడు. ఒకరోజు ఆయన నాకెదురయి కొడుకు మునిసిపల్ హైస్కూల్లో చేరితే బాగుంటునన్నాడు. ఇక నేను తాత్సారం చేయకుండా నాకు తెలిసిన మునిసిపల్ కౌన్సిలర్‌ను ఆధారంగా చేసుకొని సత్యంను మునిసిపాల్టీలో చేర్పించా.

సత్యంగాడు మునిసిపాల్టీలో చేరిన తర్వాత సీమకుర్రిసుండీ ఒక సంబంధం వచ్చింది. అమ్మాయి అందచందాలు, ఏం చదివింది పట్టించుకోకుండా జాతకం తెప్పించి. ఒక రోజంతా తలుపుపెట్టి అడ్డగీతలు, నిలువుగీతలుగీసి గళ్ళలో శుక్రుడు, గురుడు చంద్రుడు శని ఇంకేవో వ్రాసి. అంకెలు లెక్కపెట్టి, పాత పంచాంగాలు తిరగేసి, నాకు చూపించి బాగుందని చెప్పి. ఒప్పుకొని, వాళ్ళ నాన్నతో సరే నన్నాడు. వాళ్ళ నాన్న స్వతహాగా కొంచెం అనుమానం మనిషి. మరీ ఈ కాలపు ఆడపిల్లలను నమ్మడానికి వీల్లేదనే నిశ్చయానికికూడా వచ్చినట్లుంది. అందువలన అమ్మాయినిగురించి ఆరాలు తీశాడు. అమ్మాయి మంచిదని తెలిపిందికాని, కుడికన్ను పొరవచ్చి అపరేషన్ చేస్తే సరిగా కనబడటం లేదని రహస్య వర్తమానం అందింది. ముసలాయన కట్నం ఎక్కువ ఇస్తామన్నా ససేమిరా ఒప్పుకోలేదు. ఆడదాని గాలికోసం అల్లాడే స్వభావం కాదు సత్యంగాడిది. అందువలన వాడు కూడా పట్టుబట్టలేదు. మళ్ళీ సంవత్సరం వరకూ వాని పెళ్ళి గురించి ఎవ్వరూ అనుకున్న పాపాన పోలేదు. వానికి పెళ్ళిచేసుకుందామనే తొందరే లేదు. ముసలాయనమాత్రం వంటచేయడంకష్టంగా ఉందని మాత్రం వాపోయేవాడు.

సంవత్సరం తిరిగిందో లేదో మాకు పుత్రోదయం కల్గింది సత్యంగానికి శుభవార్త అందించాను.

అందించినప్పటినుండీ అబ్బాయి జన్మించిన ఘడియల తాలూకు వివరాలు సేకరించాలని వెంబడి పడ్డాడు. నేనెందుకు చెప్పానా అని బాధపడ్డాను. ఒక రోజు అర్ధపూట సెలవుపెట్టి ప్రొద్దుటే వచ్చాడు కూడా మా ఇంటికి. మొన్నామధ్య, ఎవరో ప్రెసిడెంటయిన తర్వాత ఏవో లెక్కవేసి పదవీకాలం పూర్తికాకముందే చస్తాడనితేల్చి చెప్పాడని వాని కొలీగ్ చెప్పినది గుర్తుకు తెచ్చుకొని ఉలిక్కిపడి 'ఒరేయ్! ఆ జాతకాల సంగతి ఎత్తితే తంతాను' అన్నాను. వాడు నవ్వి అక్కయ్య గారిచ్చిన టిఫిన్ తిని వెళ్ళాడు.

కొన్నాళ్ళకు సత్యంగానికి వాళ్ళ నాన్నే సంబంధం తెచ్చిపెట్టారు. అమ్మాయి తండ్రి, ముసలాయన ట్రైనింగ్‌లో సహాధ్యాయులట! సత్యంగాడు సరేనని అమ్మాయి తాలూకు జాతకం తెమ్మన్నాడు. మునుపటి మాదిరిగానే ఒకరోజు సెలవు పెట్టి లెక్కలు తేల్చి సంతృప్తిపడక వాళ్ళ స్కూల్లో పనిచేసే తెలుగు పండిట్ దగ్గరకుపోయి. సునిశితంగా పరిశీలించి కొన్ని గంటలు కూర్చొని అఖరకు అమ్మాయిని పెళ్ళిచేసుకొన్న వాడు చావడు కాని వికలాంగుడయ్యే ప్రమాదముందని తేల్చేశారట. అందువలన సత్యంగాని నాన్న ఎంత బలవంతం చేసినా ఖచ్చితంగా వద్దన్నాడు. నాకీ విషయం తెలిసి వాణ్ణి కలుసుకొని "ఒరే జాతకాల రాయుడా! ఇలా పాత పంచాంగాలు తిరగేస్తూ కూర్చుంటే నీకీ జన్మలో పెళ్ళి కాదురా' అన్నాను. వాడు నవ్వి 'ఒరేయ్! నాకు పెళ్ళి కాకున్నా ఫరవాలేదు. నష్ట జాతకురాలిని పెళ్ళిచేసుకొని ముష్టెత్తుకోవాలనా నీ కోరిక' అన్నాడు. బాగా ముదిరిందిరా వీనికి పిచ్చి అనుకొని నీ ఇష్టప్రకారమే కానీరా అని చెప్పాను.

అలా ఇలా అంటూండగానే ఇంకో సంవత్సరం దొర్లిపోయింది. మాకు ఆడపిల్ల పుట్టింది. సత్యంగాడి కసలు చెప్పనేలేదు. వాడెలాగో తెలుసుకొని నన్నడిగితే నేను "ఎవరో తమాషాగా అని ఉంటార"ని బుకాయించాను. కాని నామకరణానికి వాణ్ణి పిలవంది జరిపించుకోటానికి మనసొప్పలేదు. మధ్యాహ్నానికి భోజనానికి రారా అన్నాను ఒకరోజు ముందుగా. వాడలాగనే వచ్చి అసలు సంగతి తెలుసుకొని "ఎందుకురా అబద్ధం చెప్పావు!" సరే ఎవరి నమ్మకాలు వాళ్ళవిలే అని సరిపెట్టుకొన్నాడు. బ్రతికించావురాబాబూ మళ్ళీ ఎక్కడ మా అమ్మాయి జన్మఘడియల తాలూకు వివరాలు తెమ్మని వేధించుకుంటావోనని భయపడ్డానన్నాను. వాడు నవ్వుకొన్నాడు. ఆ తర్వాత భోంచేసి స్కూలుకెళ్తున్నా అని సెలవుపుచ్చుకొని వెళ్ళాడు.

సత్యంగానికి పెళ్ళికాలేదని దిగుల్లేదు కాని నాకు మాత్రం వాని మంచితనం చూసి, వాని జాతకాల పిచ్చిచూసి జాలేసి ఏ విధంగానైనా వీని పెళ్ళి చేయాలనుకున్నాను. ఆలోచించి ప్లానువేసి నిశ్చయానికి వచ్చాను.

మా కాలేజి తెలుగు లెక్చరర్‌గారు అబ్బాయి కొరకు వెతుకుతున్నట్లు నాకు తెలిసింది. నేను విచారించి సత్యంగాడి తండ్రిని తీసుకునిపోయి అమ్మాయిని చూపించి ఆయనను ఒప్పించి సత్యంకు చెప్పమన్నాను. వాడు ఎప్పటిమాదిరిగనే జాతకం తెమ్మన్నాడు. నవీలోపల పదిమంది పండితులనడిగి అమ్మాయికి మంచి జాతకం నేనే సృష్టించి కవర్లో పెట్టి సత్యం తండ్రికిమ్మన్నాను వాడికిమ్మని.వాడు మునుపటి మాదిరిగనే లెక్కలేసి వాళ్ళ తెలుగు పండిట్ దగ్గరకు పోయాడట. ఏమైనా వంకరపెడితే నిజంగా తన్నాలనుకున్నాను. కాని అదృష్టంకొద్దీ చాలా బాగుందనుకొని ఒప్పుకొని వాళ్ళ నాన్నతో సరేనన్నాడు. ముసలాయన వెడ్డింగ్ కార్డ్స్ దర్జాగా కొట్టించాడు. సత్యంగాడు తొలిసారిగా తన చేతులమీదుగా నాకు వెడ్డింగ్ కార్డిచ్చి 'ఒరేయ్! నా అదృష్టంచూశావురా. ఫస్ట్‌క్లాసయిన జాతకంగల అమ్మాయి దొరికింది' అన్నాడు. వాని అమాయకత్వానికి లోలోపల జాలిపడ్డాను.

పెళ్ళినాడు పెళ్ళి మంటపంలో సత్యంగాడు పెళ్ళికూతురు మెళ్ళో తాళి కడుతుంటే నాకు కళ్ళనిండా ఆనందాశ్రువులు నిండి 'ఒరేయ్! మోసమో గీసమో నీకుపెళ్ళి చేశాను. అనుకొని సంతృప్తిపడి. రిస్ట్ వాచ్ చదివించాను టైమ్ ప్రకారం నడుచుకోమని.

పెళ్ళయిన వారానికి సత్యంగాడెప్పుడో పోయిన ఇంటర్వ్యూ ఫలితంగా తిరుపతిలో ఉండే సెంట్రల్ గవర్నమెంటు స్కూల్లో జాబ్ వచ్చిందని. ఆ అదృష్టం వానిభార్య తాలూకు అదృష్ట జాతక ఫలితమేనని అన్నాడు. నే సృష్టించిన జాతకం బాగా పనిచేసిందని లోలోపల నవ్వుకొన్నాను. ★

మన ఆనందమునకు పరమావధి పూర్ణారోగ్యము, నిరోగమయిన శరీరము ఆనంద నిలయము. వ్యాధిని ప్రేరేపించు శక్తులు అనంతము- వాటితో పోరాడి గెల్చుటకు

# అంబేశ్వర ఆయుర్వేద ఫార్మశీ (రిజిష్టర్డు)

హెడ్డాఫీసు: మారుటేరు, ప.గో.జిల్లా, (ఆం.ప్ర)

వారి మందులు పూర్తిగా ఆధారపడదగినవి. వెంటనే వ్రాసి సుఖింపుడు

బ్రాంచిఆఫీసు: విజయవాడ, బీసెంట్‌రోడ్డు, L.I.C. ఆఫీసు ఎదురుగా.